క్లుప్తంగా

భక్తులకు విస్తృతంగా టీటీడీ అన్నప్రసాదాలు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో పంచమి తీర్థం సందర్భంగా టీటీడీ అన్నప్రసాదం విభాగం విశేష సేవలు అందించినట్లు భక్తులు హర్షం వ్యక్తం చేశారు. తమిళనాడు, కర్ణాటక, ఉమ్మడి చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాల నుంచి వచ్చిన భక్తులకు తిరుచానూరులో నాలుగు హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. నవజీవన్ ఆసుపత్రి, పూడి, ఎస్వీ హైస్కూల్, తోళ్లప్ప గార్డెన్‌లో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్లలో దాదాపు వందకు పైగా అన్నప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తులకు గురువారం రాత్రి నుంచి అన్నప్రసాదాలు, తాగునీరు, బాదంపాలు, కాఫీ, కదంబం, చక్కెర పొంగలి, దద్దోజనం, బిస్కెట్లు, వెజిటబుల్ ఉప్మా పంపిణీ చేశారు. టీటీడీలోని అన్ని విభాగాలు, పోలీసులు, శ్రీవారి సేవకుల సహకారంతో పంచమి తీర్థం సందర్భంగా లక్షకు పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. దాదాపు 25 వేలకు పైగా బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. శ్రీ పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాల విశేషాలను తిలకించేలా ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. భక్తులకు తాగునీరు, మొబైల్ మరుగుదొడ్లు, వైద్యం, ఆరోగ్య సేవలు అందించారు.

స్మార్ట్ సిటీ పనులు వేగవంతం చేయండి

- ఆదేశించిన కలెక్టర్



తిరుపతి స్మార్ట్ సిటీ పనులపై మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: తిరుపతి స్మార్ట్ సిటీ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్, స్మార్ట్ సిటీ చైర్మన్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్మార్ట్ సిటీ ఎండీ, నగరపాలక కమిషనర్ నారపురెడ్డి మౌర్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, తిరుపతిలో స్మార్ట్ సిటీ నిధులతో చేస్తున్న పనులు నాణ్యతా ప్రమాణాలతో ఉండేలా చూడాలన్నారు. నగరంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ భవనం నిర్మాణ పనులకు నిధులు విడుదల చేసి త్వరగా పూర్తి చేయించాలన్నారు. స్మార్ట్ సిటీ పనులను మౌర్య వివరించారు. 85శాతం వరకు పనులు పూర్తయినట్లు చెప్పారు. సమావేశంలో స్మార్ట్ సిటీ బోర్డు డైరెక్టర్లుగా ఉన్న తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుతోపాటు మరియన్న, రామచంద్రారెడ్డి, రమాశ్రీ బోర్డు, ప్రతినిధులు చంద్రమౌళి, చంద్రశేఖర్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

మహానటి సావిత్రికి రంగస్థలి ఘన నివాళి



రంగస్థలి నటి దేవసేనను సత్కరిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: మహానటి సావిత్రి చిత్రపటానికి రంగస్థలి కళాకారులు శుక్రవారం పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. పలు నాటక పోటీలలో ఉత్తమ ప్రతిభతో బహుమతులు అందుకున్న ప్రముఖ రంగస్థలి నటి దేవసేనకు ఓ హోటల్లో మహానటి సావిత్రి పురస్కారంతో ఘనంగా సత్కరించి అభినందించారు. చిత్రరంగంలో మహానటి సావిత్రి సాధించిన విజయాలు, సేవా నిరతిని స్మరించారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, కొత్తపల్లి మునిరత్నం, టి.సుబ్రమణ్యం రెడ్డి, చిత్రపు హనుమంతరావు, శంకరయ్య, బీవీ.కేశవరావు, సోము ఉమాపతి, భాస్కర్, రవి, కళాకారులు పాల్గొన్నారు.

మందు కొట్టి డ్రైవింగ్ చేస్తే ఇంతే..!

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న 11 మందికి ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్లు కోర్టు సూపరింటెండెంట్ ఎన్వీ.సుబ్బారెడ్డి తెలిపారు. నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచడంతో న్యాయమూర్తి వారికి జరిమానా విధించారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో డ్రైవర్‌కు ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడు, క్రిష్ణగిరి జిల్లా, కూటంగారి తాలూకా, రెడ్డివలసకు చెందిన క్వాలిస్ డ్రైవర్ జి.మురళికి ఐదేళ్లు జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల సెషన్స్ కేసుల విచారణ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం.. 2018 నవంబర్ 14న వైఎస్సార్ జిల్లా, ముద్దనూరు రేంజ్ ఫారెస్ట్ అధికారులు ముద్దనూరు- ఎర్రగుంట్ల రోడ్డు మార్గం తిమ్మాపురం గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేశారు. ఆ మార్గంలో మురళి క్వాలిస్‌లో మితిమీరిన వేగంతో రావడంతో అటవీ అధికారులు నిలిపి తనిఖీ చేశారు. వాహనంలో 45 కిలోలకు పైగా ఉన్న మూడు ఎర్రచందనం దుంగలను గుర్తించారు. అతడిని అరెస్ట్ చేశారు. కేసు తుదివిచారణకు రాగా నిరూపితం కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

కలెక్టరేట్‌లో పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు, పద్మావతి మహిళా వర్సిటీలో నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు, సంస్కృత వర్సిటీలో..









జై భీమ్..!

అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు అంబేడ్కర్‌కు ఘన నివాళులు అర్పించారు. నగరంలోని తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల వ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు నివాళులర్పించారు.

తిరుపతి సిటీ: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శనీయమని ఎస్వీయూ ఉపకులపతి సీహెచ్ అప్పారావు అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద ఆయన విగ్రహానికి వీసీ, వర్సిటీ అధ్యాపకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ రాజ్యాంగం రూపకల్పనతో అంబేడ్కర్ దేశానికి దిక్సూచి అయ్యారని కీర్తించారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, అధ్యాపకులు చెంద్రాయుడు, మురళీధర్, కేటీ రామకష్టారెడ్డి, సుధారాణి, సుధాకరయ్య, నరసింహులు, పీసీ వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, పాకనాటి హరికృష్ణ, పత్తిపాటి వివేక్, ఆదిశేషయ్య, ప్రిన్సిపాల్లు, డీన్లు పాల్గొన్నారు. అలాగే దళిత బీసీ కాపు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివకాపు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

పద్మావతి మహిళా వర్సిటీలో...

పద్మావతి మహిళా వర్సిటీలో ఆయన చిత్రపటానికి వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు నివాళులర్పించారు. ఆయన సేవలను కీర్తించారు.

ఆర్‌ఏఆర్ఎస్‌లో....

తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ మురళీకృష్ణ, శాస్త్రవేత్తలు కదిరి మోహన్, డాక్టర్ కరీముల్లా, రమణ, ప్రతిమ, రూపేష్ కుమార్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సంస్కృత వర్సిటీలో..

జాతీయ సంస్కృత వర్సిటీలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వర్సిటీ అధ్యాపకులు, డీన్లు అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు.



రుయాలో ..

కలెక్టరేట్‌లో ..

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసం శెట్టి సుభాష్‌తోపాటు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుపతి సెంట్రల్ బస్టాండ్ వద్ద ఆర్టీసీ బహుజన ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పరశురామ్ నేతృత్వంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజ్ ఉద్యోగులు, పేదలకు అన్నదానం చేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ పాల్గొన్నారు.

జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో..

తిరుపతి తుడా: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి తన కార్యాలయంలో, అలానే రుయా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీహరి, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఏపీ ఎన్జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు నైనార్ వరప్రసాద్, స్విమ్స్‌లో పలువురు యూనియన్ నాయకులు, వైద్యులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పలువురి నేతృత్వంలో..

తిరుపతి కల్చరల్: జిల్లా కలెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి చెన్నయ్య తదితరులు ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్డీఓ రామ్మోహన్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి చంద్రశేఖర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే, ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య, అంబేడ్కర్ భవన్ కమిటీ చైర్మన్ పి.పరమశివన్, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, టీటీడీ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘ నేత ప్రసాద్‌రావు,బీసీ నేత లక్ష్మయ్య తదితరులు కూడా పూలమాలలు వేసి ఆయన సేవలను కీర్తించారు. దళిత సంఘ నేతలు కె.మురళి, ధనశేఖర్, జయరామ్, పాల్గొన్నారు.



డీఎంహెచ్ఓ కార్యాలయంలో..

యూత్ హాస్టల్‌లో..



మాట్లాడుతున్న పుణ్యమూర్తి

తిరుపతి కల్చరల్: స్థానిక యూత్ హాస్టల్‌లో భారతీయ దళిత విద్యార్థి సేన, ఏపీ మాల విద్యార్థి, వాల్మీకి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర నేత పుణ్యమూర్తి, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ బి.సత్యనారాయణ, దళిత సేన విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు యుగంధర్, మాదిగ సైన్యం వ్యవస్థాపకుడు సుధాకర్ మాదిగ, వైఎస్ఆర్ స్టూడెంట్ యూనియన్ ఎస్వీయూ అధ్యక్షుడు ఎం.ప్రేమ్‌కుమార్, ఎస్‌జీఎస్ ప్రొఫెసర్ కె.ప్రతాప్, హిస్టరీ విభాగాధిపతి భాస్కరన్ ప్రసంగించారు. బీసీ సంఘ నేత నాగేంద్రబాబు, బీడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేడీ.ప్రసాద్,కాపు నాడు నేత శివ, సుకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో..

తిరుపతి రూరల్: పేదరికంలో పుట్టి, ప్రపంచ మేధావిగా ఎదిగిన డాక్టర్ అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు కీర్తించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. అంతకు ముందు ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ప్రాజెక్ట్స్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్, ఫైనాన్స్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, సీజీఎం ధర్మజ్ఞాని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అవిలాలలో...

అవిలాల శానప్పకాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి తిరుపతి రూరల్ మండలంలోని సర్పంచులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అవిలాల సర్పంచ్ సీవీ రమణ, సర్పంచులు పిపాసీ, కోటేశ్వరరావు, రాజా, రామచంద్రయ్య, రాజేంద్ర, ఎంపీటీసీ జయకర్, సునీల్‌చౌదరి, స్థానికులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: స్థానిక క్లాక్ టవర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎంఈఓ లలిత కుమారి, మండల యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు రామిరెడ్డి, అధ్యక్షులు రాజేంద్రబాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రధాన కార్యదర్శి ధనంజయ, కోశాధికారి చెంచయ్య, శ్రీరాములు, వెంకటరమణ, కృష్ణమూర్తి రెడ్డి, చలపతి, గోపాలకృష్ణ, సిద్ధయ్య, హరి ప్రసాద్, రవికుమార్, సీఆర్పీలు పాల్గొన్నారు.

మానవాళికి స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

- ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: గొప్ప విలువలు కలిగిన మహోన్నత వ్యక్తి, మానవాళికి స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన సమ సమాజ స్థాపనకు నిరంతరం శ్రమించి, భారత రాజ్యాంగాన్ని అందించిన మహనీయులని టీటీడీ మాజీ చైర్మన్, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ప్రస్తుతించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడం అందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ నేతలు ఎస్‌కే.బాబు, కోటూరు ఆంజనేయులు, నల్లానిబాబు, తలారి రాజేంద్ర, దేవానందం తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతున్న భూమన, చిత్రంలో మేయర్, పార్టీ నాయకులు







ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో.., తిరుపతి రూరల్: అవిలాలలో ..., చంద్రగిరి: నివాళులు అర్పిస్తున్న విద్యాశాఖ అధికారులు

అందరి సమన్వయంతో విజయవంతం

- ఎస్పీ సుబ్బరాయుడు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన పంచమి తీర్థ పుణ్య స్నానాలు ఆచరించడానికి అశేషంగా తరలి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కూడా కలగకుండా టీటీడీ ఇతర శాఖల సహకారంతో పోలీస్ శాఖ విజయవంతం చేసింది. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ, భక్తుల రద్దీకి అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో భద్రతా ఏర్పాట్లు చేయడంతోపాటు ఇతర జిల్లాల పోలీస్ సిబ్బందిని ఇక్కడ సేవలకు కేటాయించినట్లు చెప్పారు. పుణ్యస్నానం ఆచరించిన తర్వాత బయటకు పంపి, తదుపరి హోల్డింగ్ పాయింట్‌లో ఉన్న భక్తులను పుణ్యస్నానానికి పంపడం వల్ల ఎక్కడా తొక్కిసలాటలకు తావివ్వకుండా చేసినట్టు చెప్పారు. టీటీడీ, ఇతర శాఖల సమన్వయంతో విజయవంతం చేశామని, భవిష్యత్తులో కూడా ఇలాగే ముందస్తు ప్రణాళికలతో భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తామని ఆయన అన్నారు.



పద్మసరోవరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

రీసెర్చ్ స్కాలర్స్‌కు ఫెలోషిప్ ప్లీజ్!

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్, లా విభాగాలలో రీసెర్చ్ చేస్తున్న స్కాలర్స్‌కు ఫెలోషిప్‌లు రూ.15వేలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, టీఎన్ఎస్ఎఫ్, ఎస్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం శాప్ చైర్మన్ రవినాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, వర్సిటీలో ఎలాంటి ఫెలోషిప్‌లు రానివారు సుమారు 300మంది ఉన్నారని, వారికి నాన్‌నెట్ ఫెలోషిప్‌లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. వర్సిటీలో మతోన్మాదుల దాడి దారుణమని, ఇలాంటివి పునరావృతం కాకుండా వర్సిటీ అధికారులు చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు.

35వేల మంది భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న చెవిరెడ్డి, సర్పంచ్ రామచంద్రారెడ్డి తదితరులు,

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. దాదాపు 11 ఏళ్ల నుంచి ప్రతి ఏటా పంచమితీర్థం రోజున ఈ వితరణ చేస్తున్నారు. స్థానిక ఆస్థాన మండపం వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరాయంగా ఈ కార్యక్రమం కొనసాగించారు. శుక్రవారం ఉదయం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్‌తో కలసి భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం 10వేల మందికి అల్పాహారం, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మరో 25వేల మంది భక్తులకు అన్నం, సాంబారు, రసంతో కూడిన భోజనాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఎంపీటీసీలు నరేష్ రెడ్డి, యోగానందరెడ్డి, శేఖర్, ముండ్లపూడి సర్పంచ్ సురేష్ రెడ్డి, వార్డు సభ్యులు మునీంద్ర, చంద్ర, చంద్రశేఖర్ ఆజాద్, లోకేష్, మల్లికార్జున, ఆర్ఆర్ యూత్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి భక్తులకు పండ్లు పంపిణీ

చంద్రగిరి: అలమేలు మంగ సేవా సమితి ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది భక్తులకు ఆపిల్, జామ, ఆరంజ్, అరటి, రేగి పండ్లతో కూడిన పండ్ల కిట్లను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పండ్ల పంపిణీని ప్రారంభించారు. అలమేలు మంగ సేవా సమితి సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆత్మస్థైర్యంతో వికలత్వాన్ని జయించవచ్చు



లాంగ్ హ్యాండ్ స్టిక్స్ అందజేస్తున్న దృశ్యం

తిరుపతి కల్చరల్: ఆత్మస్థైర్యంతో వికలత్వాన్ని జయించడమే కాకుండా లక్ష్యాలు కూడా సాధించవచ్చని కెనరా బ్యాంక్ ఏజీఎం నాగరాజరావు అన్నారు. శుక్రవారం రాస్ కార్యాలయంలో అంతర్జాతీయ విభిన్న ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాగరాజరావు మాట్లాడారు.. దివ్యాంగులమని దిగులు పడాల్సిన అవసరం లేదని, తమ బ్యాంకు సీఎస్ఆర్ ప్రోగ్రాం కింద విభిన్న ప్రత్యేక ప్రతిభావంతులకు అవసరమైన పరికరాలు, చదువుకు, వ్యాపారానికి అవసరమైన రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం నిరుపేదలకు రెండు చక్రాల సైకిళ్లు, వినికిడి పరికరాలు, చేతి కర్రలు, దుప్పట్లు, లాంగ్ హ్యాండ్ స్టిక్స్ పంపిణీ చేశారు. కెనరా బ్యాంక్ మేనేజర్ ఉమాపతి, పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు, వికాస్ విహార్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.యువరాజ్, వికాస్ విహార్ రెసిడెన్షియల్ స్కూల్ ఉపాధ్యాయులు, డీఎంఆర్ సిబ్బంది, నాగేశ్వరరావు, బాలాజి, మాధవి, భ్రమరాంబిక పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్, మంత్రి సోమిరెడ్డి, సింగర్ స్మిత శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అలాగే, ఇస్రో ప్రయోగించనున్న శాటిలైట్ నమూనాను శ్రీవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్: తిరుపతిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, సబ్‌స్టేషన్ల పరిధిలో పనుల దృష్ట్యా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు నిలుపుదల చేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్‌జీవో కాలనీ, రామచంద్రనగర్, ప్రశాంతి నగర్, కేటీ రోడ్డు ఏరియాల్లో విద్యుత్ ఉండదని తెలియజేశారు.

భూసమస్యల పరిష్కారమే ధ్యేయం

తిరుపతి రూరల్: గ్రామాల్లో భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ అన్నారు. మండలంలోని చెర్లోపల్లె పంచాయతీలో సర్పంచ్ బొల్లినేని సుభాషిణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 47 అర్జీలు అందాయి. రికార్డులు పక్కాగా ఉంటే ఎలాంటి భూసమస్య అయినా అక్కడికక్కడే పరిష్కరిస్తామని ఆర్డీఓ అన్నారు.

దుమ్మా కొట్టిన వారికి మెమోలు

చెర్లోపల్లె సదస్సుకు ఇరిగేషన్, అటవీశాఖ, ఎండోమెంట్, మఠం ప్రతినిధులు హాజరు కాకపోవడంపై ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాని వారికి మెమోలు ఇవ్వనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు నాయక్, అధికారులు పాల్గొన్నారు.

తిరుపతిలో తుస్సుమన్న రెవెన్యూ సదస్సు!

తిరుపతి అర్బన్: తొలి రోజు తిరుపతిలో రెవెన్యూ సదస్సు తుస్సుమంది. శుక్రవారం కచ్చపి ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సులో 'భూమి లాక్కున్నారు' అనే అంశంపై 1, మంగళంలో 22-ఏ సంబంధించి 12, ఎంజాయ్‌మెంట్ అనుభవ సర్టిఫికెట్ కోసం 1, సివిల్ సప్లై 2, ఓటీఎస్ రిజిస్ట్రేషన్ 1, ఓబీసీ సర్టిఫికెట్ 1, ప్రభుత్వ భూమికి భద్రత కల్పించండి అంశంపై 1 చొప్పున అర్జీలు అందాయి. తొలి రోజు మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేవలం 5 అర్జీలు మాత్రమే రావడంతో చేసేదేమీ లేక తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి తమ కార్యాలయంలో విధులకు ప్రాధాన్యత ఇవ్వాల్సి వచ్చింది.

పనపాకంలో 111 అర్జీలు

చంద్రగిరి: మండలంలోని పనపాకంలో శుక్రవారం రెవెన్యూ సభను నిర్వహించారు. తహసీల్దార్ శివరామసుబ్బయ్య వివిధ సమస్యలపై మొత్తం 111 వినతులు స్వీకరించారు. జాతీయ రహదారి నిర్మాణ పనులకు ఇళ్లు కోల్పోయిన వారికి పక్క ఉన్న పంచాయతీలో ఇంటి స్థలాలు కేటాయించడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు ఇక్కడే ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు.

భవిష్యత్తు ఎలక్ట్రికల్ ఇంజినీర్లదే!

తిరుపతి సిటీ: భవిష్యత్తులో ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయని తిరుచ్చి ఎన్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. స్థానిక కరకంబాడిరోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో శుక్రవారం 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఇన్నోవేషన్స్ ఇన్ ద ఫ్యూచర్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్ డిజైన్ అండ్ బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు ప్రారంభంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, రానున్న కాలంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పట్టభద్రులు అవకాశాలు అందిపుచ్చుకుని సత్తా చాటాలని పిలుపునిచ్చారు. సదస్సులో మదన్‌కృష్ణ, డాక్టర్ రాంజీ తివారి, డాక్టర్ ఎస్ శరవణన్, వైస్ ప్రిన్సిపల్ ఏ.తారకేశ్వర్, డీన్ అబ్దుల్ కలాం ఆజాద్, డాక్టర్ వీ.లక్ష్మీదేవి, కుమార్ పాల్గొన్నారు.



సెమినార్‌లో అతిథులు, అధ్యాపకులు


క్షణ క్షణం.. భయం భయం



బస్టాండ్‌లో ప్రధాన ద్వారం వద్ద పెచ్చులూడుతున్న దృశ్యం.. అటువెళ్లకుండా అడ్డుగా పెట్టిన బ్యారికేడ్లు

- ఊడి పడుతున్న పెచ్చులు
- బిక్కుబిక్కుమంటూ విధులు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెచ్చులూడటం మరింత ఎక్కువైంది. మరోవైపు బస్టాండ్‌పై భాగంలో తొలి అంతస్తులో డీఎం, అసిస్టెంట్ డీఎం కార్యాలయాలతోపాటు పరిపాలన విభాగ ప్రాంతంలో మరింత ఎక్కువగా పెచ్చులు ఊడిపడుతున్నాయి. అక్కడ ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. తిరుపతి బస్టాండ్ అసిస్టెంట్ మేనేజర్ కే.వేణు కార్యాలయం ముందు సైతం శ్లాబ్ నుంచి, బస్టాండ్ మేనేజర్ బాలాజి చాంబర్ సమీపంలోనూ పెచ్చులు ఊడి పడుతుండడంతో అటు ఉద్యోగులు, ప్రయాణికులు ఎవరి నెత్తిన పడి గాయాలవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. బస్టాండ్ ప్రధాన ద్వారం 18 అడుగుల వెడల్పుతో ఉంది. ఆ మార్గం మీదుగా ప్రయాణికులు వచ్చిపోతుంటారు. అందులో 9 అడుగుల వెడల్పుతో శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో ఆ స్థలంలో ప్రయాణికులు వెళ్లకుండా చుట్టూ బ్యారికేడ్లు వేసి చేతులు దులుపుకున్నారు. సాధారణంగా బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు తమ సర్వీస్ ఏ ప్లాట్‌ఫాంపై ఉందో చూసుకునే హడావుడిలో ఉంటారు. అయితే పైకి శ్లాబ్ వైపు ఎవరూ చూడరు. అయితే శ్లాబ్ నుంచి పెచ్చులు తుక్కుతుక్కుగా పడుతున్నాయి.



తిరుపతి బస్టాండ్ పరిపాలన విభాగానికి సంబంధించిన కార్యాలయం వద్ద ఊడి పడుతున్న పెచ్చులు



తిరుపతి అసిస్టెంట్ డీఎం వేణు కార్యాలయం వద్ద ఊడిపడిన పెచ్చులు

ఆఫీస్ మార్చడానికి చర్యలు



తిరుపతి బస్టాండ్‌లో మొదటి అంతస్తులో డీఎం, అసిస్టెంట్ డీఎం కార్యాలయాలతోపాటు పరిపాలన విభాగం మొత్తంగా నడుస్తోంది. అయితే మొదటి అంతస్తులోనే ఎక్కువగా శ్లాబ్ దెబ్బతినడంతో పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో ఉద్యోగులకు మరింత ఇబ్బందిగా ఉన్నది వాస్తవమే. దీంతో ఉన్నతాధికారులకు పరిస్థితులను వివరించడంతో ఆఫీసును బస్టాండ్ ప్రాంగ నుంచి పెచ్చులు ఊడిపడుతున్న చోట ఇనుప గేట్లు ఏర్పాటు చేశాం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– బాలాజి, డిపో మేనేజర్, తిరుపతి బస్టాండ్